క్లుప్తంగా

స్వామివారికి వేద ఆశీర్వచనం



స్వామివారికి వేద ఆశీర్వచనం అందజేస్తున్న వేదపండితులు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి వేద ఆశీర్వచనం (సదస్యం) నిర్వహించారు. భద్రాచల దేవస్థానం వేదపండితుడు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ఆశీర్వచనం స్వామివారికి అందజేశారు. అలాగే నవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిత్యహోమం, చతుఃస్థానార్చన, నిత్య పూర్ణాహుతి, బలిహరణ స్వామివారి తిరువీధి సేవ మొదలగు వాటని సంప్రదాయానుసారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, ముఖ్య అర్చకులు కారంపూడి కిరణ్ కుమారాచార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజ చార్యులు, రాజగోపాలాచార్యులు, నరసింహచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ శిక్షణ తరగతులు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో 2025 సంవత్సర పది పరీక్షలకు హాజరైన విద్యార్థులకు ఉచితంగా పాలిసెట్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాసరావు, పాఠశాల కరస్పాండెంట్ ఎస్.రమేశ్ మంగళవారం తెలిపారు. సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మణుగూరు సింగరేణి ఉన్నత పాఠశాలలో నిర్వహించే శిక్షణను స్థానిక విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు పాఠశాల హెచ్ఎంను సంప్రదించాలన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి

అశ్వారావుపేట: గ్రామస్థాయిలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని, రానున్న రోజుల్లో పార్టీకి మరింత ఆదరణ లభిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం అశ్వారావుపేటలో పార్టీ క్రియాశీలక సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరిగే పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, అలాగే ఈ నెల 10, 11, 12వ తేదీల్లో గావ్ చలో–బస్తీ చలో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు బండారు చంద్రశేఖర్, జల్లిపల్లి అరవింద్, మెట్టా వెంకటేష్, మద్దాల దేవి, ఎస్వీటీ కొండ, పుష్కర్ కుమార్, శ్రావణ్‌కుమార్, మణికంఠ పాల్గొన్నారు.

కేటాయించిన పోస్టులు మంజూరు చేయండి

మణుగూరుటౌన్/మణుగూరురూరల్: బీటీపీఎస్ కర్మాగారానికి కేటాయించిన పోస్టులన్నీ మంజూరు చేయాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (1535) నాయకులు కోరారు. ఈ సందర్భంగా బీటీపీఎస్ సందర్శనకు మంగళవారం వచ్చిన సీఎండీ సందీకుమార్ సుల్తానియాకు యూనియన్ రీజినల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.ప్రసాద్, ఆర్.రాంచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీ వినతిపత్రం అందజేశారు. పోస్టుల మంజూరుతో అర్హులకు పదోన్నతులు లభిస్తాయని తెలిపారు. నాయకులు జార్జ్, జాన్‌రెడ్డి, సురేశ్, రవిచంద్ర, సాయిబాబా, ఉపేంద్రచారి, సునీత తదితరులు ఉన్నారు. కాగా, బీటీపీఎస్ నుంచి వెలువడుతున్న దుమ్ము నివారణపై దృష్టి సారించడమే కాక చిక్కుడుగుంటలో డ్రెయినేజీలు నిర్మించాలని సీపీఐ నాయకుడు అయోధ్య సీఎండీకి వినతిపత్రం అందజేశారు. అలాగే, మద్దెల వాగు పై బ్రిడ్జి తదితర సమస్యలను విన్నవించారు.

రెండో రోజుకు సమ్మె

మణుగూరురూరల్: పెండింగ్ ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మణుగూరు మున్సిపాలిటీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. రెండో రోజు దీక్షా శిబిరాన్ని సీపీఎం సీనియర్ నాయకుడు నెల్లూరి నాగేశ్వరరావు దీక్షను ప్రారంభించి మాట్లాడారు. సీఐటీయూ నాయకులు సత్రపల్లి సాంబశివరావు, సీపీఎం నాయకుడు బండి రాజేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పల్లపు నాగేశ్వరరావు, సీహెచ్ నరసింహరావు, దుర్గయ్య, రమాదేవి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో 'డబుల్' ఇళ్లు

- బీఆర్ఎస్ హయాంలో పునాదులు
- నిర్మాణ దశలోనే నిలిచిపోయిన వైనం
- నేటికీ పట్టింపులేని అధికారులు
- ఇందిరమ్మ పథకంలోనైనా పూర్తయ్యేనా?



మొదటి అంతస్తుతో నిలిచిన నిర్మాణం



బేస్‌మెంట్ స్థాయిలో నిలవడంతో దట్టంగా పెరిగిన పొదలు

ప్రతి పేదవాడికీ సొంత ఇంటిని నిర్మించి ఇవ్వాలనే సంకల్పంతో గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కొన్ని చోట్ల లక్ష్యాన్ని చేరుకోలేకపోయాయి. భద్రాచలంలో డబుల్ ఇళ్లు నిర్మాణదశలో పనులు ఆగిపోయి శిథిలావస్థకు చేరుతున్నాయి. అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో కోట్లాది రూపాయల ప్రజాధనం బూడిదలో పోసి పన్నీరులా అయిపోతోంది.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం మనుబోతుల చెరువు కాలనీలో సుమారు 250 ఇళ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. ప్రారంభంలో పనులు శరవేగంగా సాగినప్పటికీ ఆ తరువాత పనులకు బ్రేకులు పడ్డాయి. ఈ ఇళ్ల కోసం స్థానికులు ధర్నాలు, రాస్తారోకోలు చేయడంతో పాటు ఇళ్ల నిర్మాణ ప్రదేశంలో నిరాహార దీక్షలు సైతం చేశారు. అనంతరం అధికారుల చర్చలతో కాంట్రాక్టర్ పనులను చేపట్టినప్పటికీ పూర్తి స్థాయిలో నిర్మాణం కాలేదు. అలా ఆగుతూ.. సాగుతూనే ఉన్న పనులు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడే వరకు సాగాయి. కాంగ్రెస్ అధికారంలో రాగానే నిర్మాణం పూర్తైన ఇళ్లకు రంగులు వేసి సుమారు వంద వరకు అర్హులైన స్థానికులకు అధికారులు లాటరీ పద్ధతిలో ఇళ్లను ఇచ్చారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ ఇంకొన్ని ఇళ్లు ఇప్పటికీ నిర్మాణ దశలోనే ఉండిపోయాయి.

ఐదేళ్లుగా సాగుతున్న పనులు..

బీఆర్ఎస్ పార్టీ రెండో సారి అధికారంలో వచ్చిన తరువాత ప్రారంభించిన ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగింది. కాంట్రాక్టర్లకు పూర్తి స్థాయిలో బిల్లులు మంజూరు చేయకపోవడంతో పనులను మధ్యలో వదిలేశారు. అప్పటి నుంచి ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. మూడు అంతస్తులతో ప్రణాళిలు సిద్ధం చేసి పనులను ప్రారంభించిన అధికారులు.. కొన్ని ఇళ్లను పూనాదుల స్థాయిలో మరికొన్ని మొదటి, రెండో అంతస్తు వరకు పూర్తి చేశాసి వదిలేశారు. దీంతో ఐదేళ్లుగా నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. ఈ భవనాలను అకతాయిలు అడ్డాలు చేసుకుని తమ ఆగడాలు సాగిస్తున్నారు. రాత్రి, పగలు మందు పార్టీలతో పాటు వివిధ రకాల జూదాలకు ఈ భవనాలు కేరాఫ్‌గా మారాయి. దీంతో చుట్టు పక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇందిరమ్మ పథకంతో లబ్ధి

అసంపూర్తిగా వదిలేసిన భవనాలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ పథకంలో చేర్చి తద్వారా పూర్తి చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. సుమారు 60 ఇళ్ల వరకు రెండు అంతస్తులు కట్టుబడి పూర్తి కాగా, మిగతా పనులు పూర్తి కావాల్సి ఉంది. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను ఇందిరమ్మ పథకంలో చేర్చి పూర్తి చేస్తే సమస్య పరిష్కారమవుతుంది. పట్టణంలో అనేక మంది ఇంటి స్థలం కూడా లేనివారు ఉన్నారని, అటువంటి వారికి ఈ ఇళ్లను పూర్తి చేసి కేటాయించాలని పలు సంఘాల నాయకులు అధికారులకు విన్నవిస్తున్నారు. అధికారులు స్పందించి నిర్మాణ పనులు పూర్తి చేసి ఇళ్లు లేని పేదలకు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

ఇళ్లు లేనివారికి ఇవ్వాలి

అసంపూర్తిగా ఇళ్లు ఉండడంతో ఆకతాయిలు అడ్డగా చేసుకున్నారు. చీకటి పడితే చాలు కాలనీ వాసులు అటువైపు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి పేదలకు పంపిణీ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మణెమ్మ, మనుబోతుల చెరువు

పాములు వస్తున్నాయి..

ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతోపాటు చుట్టూ పొదలు భారీగా పెరిగిపోయాయి. దీంతో పొదల్లోకి విషసర్పాలు చేరి చుట్టూ ఉన్న ఇళ్ళలోకి తరుచూ వస్తున్నాయి. రాత్రి, పగలు ఇళ్ల ఎదుట లైట్లు వేసి ఉంచాల్సి వస్తోంది.

– శ్రీను, మనుబోతుల చెరువు

ఇందిరమ్మ పథకంలో చేర్చాలి

గత ప్రభుత్వం డబుల్ ఇళ్ల పేరుతో నిర్మించి వదిలేసిన ఇళ్లను ఇందిరమ్మ పథకంలో చేర్చి అర్హులకు పంపిణీ చేయాలి. అప్పుడు ఇళ్లు శిథిలమై పోకుండా గూడు లేని పేదవారికి ఇచ్చినట్లు అవుతుంది.

– అల్లాడి పౌల్‌రాజ్, మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి

బస్టాండ్‌లో వాటర్ ప్లాంట్ ప్రారంభం

చర్ల: చర్లలోని ఆర్టీసీ బస్టాండ్‌లో స్థానికుల ఆర్థిక సాయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను చర్ల సీఐ రాజువర్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనులతో కలిసి మంగళవారం డిపో మేనేజర్ తిరుపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిపో మేనేజర్ మాట్లాడుతూ.. ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు విశేషంగా కృషి చేసిన దొడ్డి హరినాగవర్మను, ఆర్థిక సాయం అందించిన దాతలను ఆయన అభినందించారు. అనంతరం సీఐ రాజువర్మ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్, భద్రాచలం డిపో అసిస్టెంట్ మేనేజర్ గౌతమి, చర్ల బస్టాండ్ కంట్రోలర్ లాలయ్య, ఆర్టీసీ సిబ్బంది అల్లం నాగేశ్వరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లపు దుర్గాప్రసాద్, మేమున్నాం సహాయక కమిటీ చైర్మన్ లయన్ డాక్టర్ నీలి ప్రకాశ్, మాజీ ఎంపీపీ గీదా కోదండరామయ్య, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సీఐ రాజువర్మ, డీఎం తిరుపతి

కొత్త ఇసుక సొసైటీని ఎన్నుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని చినరావిగూడెం గ్రామం సమ్మక్క–సారక్క ఇసుక సొసైటీని రద్దు చేసి కొత్త కమిటీని ఎన్నుకోవాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. మంగళవారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గ్రామస్తులు మాట్లాడారు. నిబంధనల ప్రకారం రెండు సంవత్సరాలకు ఓ సారి సొసైటీ కమిటీ మారాల్సి ఉన్నప్పటికీ.. ప్రస్తుతం ఉన్న సొసైటీ ఏడు సంవత్సరాలుగా కొనసాగుతోందని అన్నారు. ఈ మేరకు కొందరు గుత్తేదారులతో చినరాయిగూడెంలో రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. సొసైటీని చీల్చి ఇసుకరీచ్ పొందాలని ఓ కాంట్రాక్టర్ యత్నిస్తున్నట్లుగా చేసిన ఆరోపణలు నిరాధారమైనవని అన్నారు. అధికారులు స్పందించి కొత్త కమిటీ ఎన్నుకునేందుకు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. సమావేశంలో నూతన కమిటీ ఆశావహులు కుంజా లక్ష్మి, సోందె నర్సమ్మ, నాగమణి, పాల్వంచ సత్తమ్మ, కుంజా సుజాత, మిడియం వెంకటరమణ, వెంకటమ్మ, తెల్లం రాధ, కుంజా దుర్గ, సోందె శైలజ తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పథకానికి కేంద్రం తూట్లు

బూర్గంపాడు: ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథకానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు ఆరోపించారు. ముసలిమడుగు గ్రామపంచాయతీలోని రామాపురంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చట్టబద్ధత కలిగిన పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. మండుటెండలలో పనులకు వెళ్తున్న కూలీలకు కనీస వేతనం కూడా రావడం లేదని అన్నారు. సమావేశంలో ఎస్‌కె.అబీదా, పాపినేని సరోజిని, బత్తుల ద్రౌపతి, మీనా, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి

గుండాల: మండలంలోని ఆకాల గాలి దుమారం, వర్షానికి దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం వెంటనే స్పందించి సర్వే చేయించి నష్టపరిహారం చెల్లించాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ముక్తి సత్యం, కొరం సీతారాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ ఇమ్మానుయేల్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. మొక్కజొన్న, వరి ఎకరాకు రూ.50వేలు, మిర్చికి రూ.లక్ష చొప్పున రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేసి, ఇళ్లు ధ్వంసం అయిన కుటుంబాలకూ పరిహారం అందించాలని అన్నారు. యాసారపు వెంకన్న, పర్శిక రవి, బానోత్‌లాలు, మానాల ఉపేందర్, సుందర్రావు, బుచ్చయ్య, సుధాకర్, రమేష్, ఆనంద్, బుచ్చయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పినపాక: మండల పరిధిలోని సీతంపేట గ్రామానికి చెందిన బట్ట రవి చిన్న కుమారుడు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆర్థిక పరిస్థితుల్లో సతమతమౌతున్న నేపథ్యంలో.. వైద్య ఖర్చుల నిమిత్తం జనం కోసం మనం స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. మంగళవారం బాధితుడిని పరామర్శించి రూ.15 వేలను వితరణగా అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వేముల భాస్కర్, కొండేరు సతీష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలతోనే బంగారు బాటలు

చర్ల: ప్రభుత్వ పాఠశాలలతోనే విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయని, ప్రతీ ఒక్కరూ వారిపిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోని చదివించాలని మండల విద్యాశాఖాధికారి పీవీ రమణ సూచించారు. మండలంలోని కుదునూరులో ఉన్న ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు పరిటాల పద్మావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ పీవీ రమణ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కుదునూరు జిల్లా పరిషత్ హైస్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాయం విజయబాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాదరావు, టీఎస్ పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఎస్ఎస్ఎస్ రవికుమార్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్, టీఎస్ కాకా రాంబాబు, ఏటీఏ మండల అధ్యక్షుడు శ్యామల రామారావు, పీఎం శ్రీ ఎంపీపీఎస్, ఇతర ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న ఎంఈఓ రమణ

త్వరలోనే వంద పడకల ఆస్పత్రి

- అనుబంధంగా నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి
- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వెల్లడి

అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలో త్వరలోనే ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామని, దీనికి అనుబంధంగా నర్సింగ్ కళాశాల ఉండేలా కృషి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రకటించారు. మంగళవారం స్థానిక ఆస్పత్రిలో ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను ఆయన ప్రారంభించారు. తర్వాత ఆస్పత్రిలో దాదాపు రెండు గంటల పాటు వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి వైద్య సేవలు, సౌకర్యాలు, సమస్యలను తెలుసుకున్నారు. డయాలసిస్ సెంటర్‌ను సందర్శించి రోగులతో మాట్లాడి సేవల గురించి అడిగారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. వంద పడకల ఆస్పత్రిని సుమారు ఇరవై ఎకరాల సువిశాలమైన స్థలంలో ఏర్పాటు చేస్తామని, ఆస్పత్రి భవనాల నిర్మాణాలకు సంబంధించిన టెండర్ ప్రక్రియ దశలో ఉందని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వనం కృష్ణ ప్రసాద్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంపీఓ ఎస్.ప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధా రుక్మిణి, సిబ్బంది రెహ్మత్, కృష్ణ, కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, మిండా హరి, నార్లపాటి దివాకర్, డి రమేష్, మూర్తుజా ఖాన్, అప్పలరాజు, ప్రతాప్ పాల్గొన్నారు.

పలు కార్యక్రమాలకు హాజరు..

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయం, గ్రామాల్లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. మంగళవారం మండలంలోని దురదపాడు గ్రామంలో అంకమ్మ తల్లి జాతర ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే జారే.. అమ్మవారిని దర్శించుకున్నారు. కొమ్ముగూడెం, ముష్టిబండ గ్రామాల్లోని చౌకధరల దుకాణాలను సందర్శించి, పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని పరిశీలించారు. రేషన్ డీలర్లకు తగు సూచనలు చేశారు. గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూస్ అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అదే క్యాంపు కార్యాలయంలో జై బాపు, జై భీమ్ సంవిధాన్ పేరుతో నిర్వహించనున్న రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు నాగ సీతారాములు, ప్రమోద్ కుమార్, రామలక్ష్మణ్, సురేష్ నాయక్, మంగీలాల్, పసుపులేటి వీరబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సలీం, ఏఈలు సాయికృష్ణ, వరప్రసాద్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి ఆవరణలో క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

ప్రణాళికలు సిద్ధం చేయండి



పినపాక: వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ సునీల్ కుమార్

అశ్వారావుపేటరూరల్: వచ్చే ఏడాది చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికలను శాఖల వారిగా సిద్ధం చేయాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ రాజ్, వైద్య, ఆరోగ్య, ఐకేపీ, ఈజీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళికలు, ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలన్నారు. ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంపీఓ సోయం ప్రసాద్, సీడీపీఓ ముత్తమ్మ, వైద్యాధికారి డాక్టర్ రాందాస్, ఏపీఎం వెంకటేశ్వరరెడ్డి, ఈజీఎస్ ఏపీఓ రామచంద్రరావు పాల్గొన్నారు.

పినపాక: మండలంలో అన్ని శాఖల అధికారులు తమ అభివృద్ధి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎంపీడీఓ సునీల్ కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సబ్ కా సాత్, సబ్ కా వికాస్ లో భాగంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు వారి సంవత్సరం యాక్షన్ ప్లాన్‌ను చదివి వినిపించారు. అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి



ఐటీసీ జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న అఖిలపక్షం నాయకులు

బూర్గంపాడు: సారపాక మేజర్ గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఐటీసీ పీఎస్‌పీడీ చొరవ తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఐటీసీ పీఎస్‌పీడీ జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్) శ్యామ్‌కిరణ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. సారపాకలోని పలు కాలనీల్లో డ్రెయినేజీలు సరిగా లేవని, రోడ్లు గుంతలు పడి మురుగునీరు నిలుస్తోందని తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో డ్రెయినేజీలు, రోడ్లు అభివృద్ధి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు ఏనుగుల వెంకటరెడ్డి, తాళ్లూరి జగదీశ్వరరావు, గోపిరెడ్డి రమణారెడ్డి, కొనకంచి శ్రీనివాస్, ఎస్‌కె.సైదులు, బత్తుల వెంకటేశ్వర్లు, మువ్వ వెంకటేశ్వరరావు, చుక్కపల్లి బాలాజీ, కొమటిరెడ్డి మోహన్‌రెడ్డి, కాకర్ల సత్యనారాయణ, గుర్తింపు కార్మిక సంఘ నాయకులు కనకమేడల హరిప్రసాద్, గాదె రామకోటిరెడ్డి తదితరులు ఉన్నారు.

వ్యాసరచన పోటీలు

దుమ్ముగూడెం: మండలంలోని కే.రేగుబల్లి–2 (సూరారం) ఆదర్శ గిరిజన బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు 'బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌లో విద్యార్థుల పాత్ర, కర్తవ్యం' అనే అంశంపై వ్యాసరచన పోటీలను మంగళవారం నిర్వహించారు. జిల్లా కోర్టు సెక్రటరీ భానుమతి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చిల్డ్రన్ పారా లీగల్ వాలంటీర్ పిలక వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. బాల కార్మికుల చట్టాలు, బాల్య వివాహాలు, విద్య హక్కు, పోక్సో యాక్ట్ తదితర అంశాలను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భారతి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

దుమ్ముగూడెం: గ్రామాల్లో మంచినీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ అశోక్ కుమార్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం తూరుబాక, సింగవరం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన స్టోర్‌లలో ఇస్తున్న సన్నబియ్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్ఐ కల్లూరి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు కార్తీక్, శ్వేత పాల్గొన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

మణుగూరురూరల్: జాతీయ స్థాయి ఐఎన్‌టీఎస్ఓ మాథ్స్ విభాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన గుట్టమల్లారంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి హర్షిత్‌కు మణుగూరు ఎంఈఓ స్వర్ణజ్యోతి చేతుల మీదుగా మంగళవారం మండల విద్యావనరుల కేంద్రంలో ల్యాప్‌టాప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థి హర్షిత్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయం అన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతీ విద్యార్థి చదువుతో పాటు పోటీ పరీక్షల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం జయప్రకాష్, కోఆర్డినేటర్ వెంకట్, పాఠశాల ప్రిన్సిపల్ యుగంధర్, ఆకాడమిక్ డీన్ భాస్కర్ రెడ్డి, సీ బ్యాచ్ ఇన్‌చార్జ్ కొమరయ్య, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తారనే సీపీఎం కార్యకర్తల అరెస్ట్

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి కల్యాణ మహోత్సవానికి వచ్చిన సీఎంను భద్రాద్రి సమస్యలపై ప్రశ్నిస్తారనే సీపీఎం కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయించారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భద్రాద్రి పట్టణ సమస్యలపై ప్రకటన చేస్తారని ఎదురు చూసిన పట్టణ ప్రజల ఆశలపై ముఖ్యమంత్రి నీళ్లు చల్లారని విమర్శించారు. సమావేశంలో గడ్డం స్వామి, ఎంబి.నర్సారెడ్డి, పి.సంతోష్ కుమార్, డి.సీతాలక్ష్మి తదతరులు పాల్గొన్నారు.